**సాహసంలో ముందడుగు వేస్తే విజయం దక్కే అవకాశం ఉంటే ఉంటుంది గానీ పోయేది మాత్రం ఏం ఉండదు... పిరికితనం తప్ప**

# ధీర

కాలేజి నుండి ఇంటికి వచ్చిన సమీర పుస్తకాలను గదిలోని అలమారాలో సర్దుకుంటూడగా వినిపించిన తల్లిదండ్రుల మాటలకు ఉలిక్కిపడింది.

డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న తండ్రికి టీకప్పు అందిస్తూ కాబోలు తల్లి అంది.

"ఈ పూటతో టీ పొడి కూడా అయిపోయింది. రేపటి వరకూ పరవాలేదు గానీ ఆ తర్వాత వంటకీ సరుకులేం లేవు. ఏం చేయాలో ఆలోచించండి.."

"ఆఖరి టీ అన్నావుగా, అందుకేనేమో చాలా రుచిగా ఉంది! నీకూ తెచ్చుకోలేదంటే, ఈ కప్పు టీ మాత్రమే ఉందన్నమాట. అవునా...? ఇదే ఇద్దరం చెరి సగం తాగుదాం.." మళ్ళీ రెండు మూడు నిముషాల తర్వాత తండ్రి మాటలు సమీరకు వినిపించాయి.

"ఏం చేయాలో నాకేం పాలుపోవటం లేదు. అమ్మటానికి కూడా ఇంట్లో విలువైన వస్తువులేం లేవు. అందరం కలిసి ఒక్కసారే పైకి వెళ్ళిపోయే ఆలోచన చేద్దామా..?"

"ఛ... ఛ.. అవేం మాటలు..?" సుమిత్ర కొంచెం గట్టిగానే అంది.

కర్టెను తీసుకుని బయటకు వచ్చిన సమీరకు తండ్రి తన గదిలోకి వెళ్ళిపోతోంటే, కన్నీళ్ళతో కూర్చున్న తల్లి కనిపించింది.

పక్క కుర్చీ జరుపుకుని కూర్చుని తల్లి చేయి పట్టుకుని "ఇదేంటమ్మా.. నాన్న అలా మాట్లాడుతున్నారూ...?" అంది. గొంతు పూడుకుపోయింది.

సుమిత్ర ఉలిక్కిపడి నిశ్చేష్టురాలిలా చూస్తూ "నువ్వొచ్చి ఎంత సేపయిందే.. చూడనే లేదూ..." అంది.

"ఆఖరి పీరియడ్ లేకపోవటం వలన కొంచెం ముందుగా వచ్చేసాలే. పది నిముషాలయింది అంతే..." అంది.

కూతురు తమ మాటలన్నీ విన్నదని సుమిత్రకు అర్థమైంది. సర్దుకుని కళ్ళు తుడుచుకుంది. "డబ్బు తీసుకుని రూల్సుకు విరుద్ధంగా చేయనన్నందుకు ఆ పెద్దాయన ఎవరో తన పవర్‌తో మీ నాన్నని సస్పెండ్ చేయించి అపుడే నాలుగు నెలలు గడిచిపోయాయా, ఆ ఎంక్వైరీ కమిటీ రిపోర్టును కూడా డబ్బుల కోసం ఏదో కారణాలు చెబుతూ నొక్కి పెడుతున్నారు! నిజాయితీని అవినీతి మార్గంలో లంచమిచ్చి నిరూపించుకోవాల్సిన పరిస్థితేమిటని మీ నాన్న బాధ. ఆ పైన ఇలా ఇంట్లో జరుగుబాటుకూ పైసా కూడా మిగలని గడ్డు రోజులతో ఆయన ధైర్యం రోజురోజుకీ దిగజారిపోతోంది...!" కంఠం గద్గదితమైంది.

సమీర తల్లి భుజం మీద చేయి వేసి "అమ్మా.. నువ్వు దిగులు పడకుండా నాన్నకి ధైర్యం చెప్పు.. పరిస్థితి ఇలాగే ఉండిపోదు. నాన్న తన నిజాయితీని నిరూపించుకుని మళ్ళీ ఆఫీసులో జాయినవుతారు. అప్పటివరకూ ఇంటి ఖర్చులకోసం ఏదైనా చేసి సంపాదించే మార్గం ఆలోచిద్దాం.." అంది.

"అంటే.. చదువు మానేస్తానంటావా...?" ఆదుర్దాగా అడిగింది సుమిత్ర.

"లేదమ్మా.. ఎట్టి పరిస్థితుల్లోనూ చదువు ఆపెయ్యను. ఒకవేళ అలాంటి పరిస్థితి వచ్చినా అంత బెంబేలు పడనక్కర్లేదు. ఇల్లు గడిచే దారిని వెతుక్కోవాలి. రెండు మూడు రోజుల్లోనే ఏదో పరిష్కారం దొరుకుతుంది... నువ్వేం కంగారు పడకు.." అంటూ సమీర తల్లికి ధైర్యం చెప్పింది.

ఆ తర్వాత తండ్రితోనూ ఏదో పిచ్చాపాటి మాట్లాడుతున్నట్లుగానే ఆయన సస్పెండ్ కావటానికి కారణమైన పరిస్థితినీ వివరంగా మరోసారి తెలుసుకుంది.

ఆ రాత్రి సమీరకు చాలాసేపటి వరకూ నిద్ర పట్టలేదు. ఏవేవో ఆలోచనలు. క్రిందటి సంవత్సరమే తన క్లాస్‌మేట్ ఒకబ్బాయి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. కొంచెంలో ప్రమాదం నుండి బయటపడ్డాడు. తమ ఇంటికి దగ్గరగా ఉన్న హాస్పిటల్‌లోనే ఉండటంతో కాలేజీకి వెళ్లేముందు అతనిని పలుకరిస్తానని తండ్రికి చెప్పినపుడు తనూ వస్తానని కూడా వచ్చారు.

అతని తల్లిదండ్రుల్ని పలుకరించి, ఆ తర్వాత ఆ అబ్బాయి పక్కన కూర్చుని నాన్న ఆ రోజు ఎంతో స్నేహంగా, చక్కగా మాట్లాడారో తనకి బాగా గుర్తుంది.

చదువు, ప్రేమా, పెళ్ళి... ఇలా ఏ సమస్య వచ్చినా పిల్లలు తల్లిదండ్రులతో, ఆత్మీయులతో చెప్పుకుంటే, ఎవరో ఒకరి ద్వారా, ఏదో మార్గాన పరిష్కారం దొరికే అవకాశం ఉంటుంది కదా, సమస్యతో పోరాడితే, ఫలితం ఉంటే ఉంటుంది గానీ, ప్రాణాలకంటే విలువైనదేదీ పోదు కదా..? అందుకే ప్రయత్నం చేస్తూనే ఉండాలిగానీ ప్రాణాలు తీసుకోవాలనే ఆలోచన మాత్రం చేయకూడదు.

పిల్లలు ఆత్మహత్య చేసుకోవటమంటే, తల్లిదండ్రులకు ఎంతటి దారుణమైన శిక్షను విధించటమో ఆలోచించ గలిగితే, అటువంటి పనిని చేయలేరు!

యధాతథంగా ఈ మాటలే కాకపోవచ్చును గానీ నాన్న తన క్లాస్‌మేట్‌తో జరిపిన సంభాషణా సారాంశం మాత్రం ఇదే!

ఆ రోజు అలా మాట్లాడిన నాన్న ఇపుడిలా మాట వరసకైనా సరే ప్రాణాలు తీసుకోవటమనే ప్రసక్తి తీసుకువచ్చారంటే.. ఎంతటి నిరాశా నిస్పృహలతో ఉన్నారో అర్థమవుతోంది.

నాలుగు నెలల క్రితం... తను కాలేజి నుండి సాయంకాలం వచ్చేసరికి నాన్న డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని టీ తాగుతున్నారు.

ఎప్పుడూ ఏడు గంటల తర్వాత గానీ ఇంటికి రాని నాన్న ఆ రోజు మాత్రం ఆఫీసు నుండి వచ్చేసరికి తనకి ఆశ్చర్యంగా అనిపించింది. పక్కనే కూర్చుంటూ ఆ మాటే అడిగింది.

"ఆఫీసు పనితో బాగా అలసిపోయానని, కొన్నాళ్ళు ఇంట్లో ఉండి విశ్రాంతిగా గడపమని సెలవు ఇచ్చారమ్మా.." అన్నారు నాన్న నవ్వుతూ.

అమ్మను చూస్తే ఎందుకో సీరియస్‌గా ఉంది.

''మీకు సెలవు ఇస్తే, అమ్మకి ఆనందంగా ఉన్నట్లు లేదే, ఎందుకో కోపంగా ఉన్నట్లుందీ..?" తన ప్రశ్నకి నాన్న మళ్ళీ నవ్వారు. "ఉండదా మరీ..? నేను ఇంట్లో ఉంటే గంట గంటకూ ఏదో ఒకటి అడుగుతూంటాను. పని పెరుగుతుంది. అదొక కారణం. ఇరుగు పొరుగుతో కబుర్లు చెప్పుకోవటం, తనకిష్టమైన ప్రోగ్రాములు టీ.వి.లో చూడటం లాంటివన్నిటికీ నేను రోజంతా ఇంట్లో ఉండటం వలన ఆటంకం ఏర్పడుతుందిగా. అలా తన స్వేచ్ఛ తగ్గిపోవటం మరొక కారణం. ఇంకా" అని ఏదో చెప్పబోతుంటే, అమ్మ అడ్డం వచ్చింది.

"నిజాయితీ, సమర్థతా గుర్తించి ప్రమోషన్లు ఇవ్వటం కాదు, మీ నాన్నని సస్పెండ్ చేసి ఇంట్లో కూర్చోమన్నారు. దీన్నే చమత్కారంగా చెబుతున్నారు.." విసురుగా అంది.

"నిజమా.. నాన్నా..?" ఆశ్చర్యంగా చూస్తూ తనడిగిన ప్రశ్నకి మళ్ళీ నవ్వారు.

"ఇందులో అంత బాధపడాల్సిందేం లేదమ్మా. నేను మామూలుగా నా ఉద్యోగ ధర్మానికి తలొంచుతాను గానీ అదనంగా వచ్చే పై రాబడికి కాదని నీకూ తెలుసు గదా. ఓ పెద్దాయన ప్రమేయం ఉండటం వలన తన పలుకుబడితో నన్ను సస్పెండ్ చేయించగలిగారు. ఆ తర్వాత ఎంక్వైరీ చేసి నా తప్పేమీ లేదని నిర్ధారించి మళ్ళీ జాయినవమంటారు. ఈ మాత్రం దానికి అనవసరంగా హైరానా పడటం దేనికీ.. ఇది మీ అమ్మకి అర్థం కావటం లేదంతే గానీ."

"నాన్న చెప్పిందే కరెక్టమ్మా. సస్పెన్షన్ అనుకోకుండా సెలవులనుకుంటే సరదాగా ఉంటుందిగా. నాన్న సాయంకాలాలు ఇంట్లో ఉండటమనేదే కుదరటం లేదని అంటూంటావుగా... ఇపుడు చక్కగా సినిమాలకీ, షికార్లకీ వెళ్లిరండీ..." అంది అమ్మతో, తనూ తనవ్వుతూ.

అపుడు అమ్మ ఏం మాట్లాడలేదు గానీ గట్టిగా నిట్టూర్చి ఊరుకుంది.

ఆ నిట్టూర్పులోని అంతరార్థమేమిటో ఇపుడు అర్థమౌతోంది సమీరకి. అరకొర జీతంతో ముగ్గురు పిల్లల చదువు ఖర్చులు, ఇంటి జరుగుబాటు అన్నీ సవ్యంగా సాగటమంటే కత్తిమీద సామేనని అమ్మకి ఓ అవగాహన ఉండే ఉంటుంది.

నాన్న కూడా సస్పెన్షన్ తీసెయ్యటానికి ఇన్నాళ్ళు పడుతుందని ఊహించి ఉండరు.

పొదుపు చేసిన కొద్దిపాటి బ్యాంక్ బాలెన్స్ కూడా పూర్తయి పోవటంతో నాన్న ధైర్యం దిగజారిపోయిందన్నమాట!

సమీర ఒక నిశ్చయానికి వచ్చింది. ముందుగా ఒక ప్రయత్నం చేశాక, ఆ తర్వాత ఎక్కడైనా పిల్లలకు ట్యూషన్ చెప్పే అవకాశం గానీ, సాయంకాలం మాత్రమే చేయగలిగే పార్ట్‌టైమ్ జాబ్‌గానీ దొరుకుతుందేమో ప్రయత్నించాలని అనుకుంది.

అలా ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాక నిశ్చింతగా నిద్రపోయింది.

❈ ❈ ❈

ఆ మరునాడు...

కాలేజికి బయలుదేరే ముందు తండ్రికి ధైర్యం చెబుతూ భరోసాగా ఉండాలనే విషయాన్ని తల్లికి మరోమారు నొక్కిచెప్పింది. స్నేహితురాలింటికి వెళ్ళిన సమీర ఆమెకు తమ కుటుంబ సమస్యనూ పరిష్కారం కోసం తను చేయదలచుకున్న ప్రయత్నాన్నీ చెప్పింది.

ఆ అమ్మాయి ఆశ్చర్యంగా "ఇదేమిటే... ఇలాంటి ఆలోచన ఎలా వచ్చిందీ...?" అంది.

తన ఆలోచనకు స్ఫూర్తి ఏమిటో సమీర వినిపించింది. "ఆ మధ్య పేపర్‌లో ఒక వార్త చదివా. ఏం చేయాలా అని ఆలోచిస్తుంటే, అది గుర్తుకు వచ్చింది. ఒక హైస్కూలు స్టూడెంట్ బస్సులోని ప్రయాణీకుల ముందు చేయి చాచి డబ్బు అడుగుతూ కారణం ఏం చెప్పాడో తెలుసా? తమ కుటుంబానికో లేక స్కూలులో అతనికో రావాల్సిన బెనిఫిట్ కోసం ఒక సర్టిఫికెట్ అవసరమై దానికి సంబందించిన ఆఫీసుకు వెళ్తే, లంచం ఇస్తే గానీ వీలుకాదన్నారట! ఇచ్చే ఆర్థిక స్థోమత లేక ఇలా యాచిస్తున్నానని చెప్పాడట!

ఆర్థికంగా లోటు లేని వాళ్ళు తమ పనులు సక్రమమైనవైనా, అక్రమమైనవైనా సరే తొందరగా చేయించుకోవాలని ఉద్యోగస్తులుకు లంచమిచ్చే అలవాటును చేస్తే కొందరేమో మనలాంటి మధ్యతరగతి వాళ్లను, పేదలనూ కూడా వదలకుండా పట్టుబడుతున్నారన్న మాట!

ఈ సమాజం అంతా గంజాయి వనమే కాదు, అక్కడక్కడా అయినా తులసి మొక్కల్లాంటి నిజాయితీ పరులైన ఉద్యోగస్థులూ ఉన్నారు. మనం ఇలా గంజాయి మొక్కల్ని పీకే పనిలో పడితే, తులసి మొక్కలు విస్తరించగలుగుతాయి! లంచం తీసుకోకపోవటమనేది తెలివి తక్కువతనంగా, తీసుకోవటమనేది ఎవరూ తప్పుపట్టలేని, అందరికీ ఆమోద యోగ్యంగా మారిపోయిందిపుడు! గుట్టుచప్పుడు కాకుండా మన పనిని పూర్తి చేయించుకుని సంతృప్తి పడటం కాదు, లంచం అడిగినవారి

పేర్లను బయటపెట్టి, వాళ్ళు సిగ్గుపడే పరిస్థితిని కల్పించాలి. మనకోసమే, మనం తులసి వనం లాంటి మంచి సమాజం కోసం నడుం బిగించాలి! అపుడే ఈ అవినీతి అంటు జబ్బులా వ్యాపించకుండా నిరోధించబడుతుంది. లేకపోతే తులసి మొక్కలు అసలే లేకుండా మాయమైపోయే ప్రమాదం ఏర్పడుతుంది తెలుసా...?" అంది సమీర.

సమీర స్నేహితురాలు చిన్నగా నవ్వింది. "చప్పట్లు కొట్టి అభినందనలు తెలియజేయాల్సినంత బావుంది నీ ఉపన్యాసం! ఆచరణలో సాధ్యమేనా అని ఆలోచించావా...? నువొక్కదానివీ ఏం చేయగలవ్...?"

"ప్రయత్నం అంటూ చేస్తేనే గదా, సాధ్యమో, అసాధ్యమో తెలిసేది. నా ప్రయత్నానికి మీరు సపోర్టుగా నా వెంట వస్తే చాలు. ఈ రోజుకి కాలేజీకి సెలవు పెట్టాలి మరి..!" అంది సమీర. ఆ తర్వాత ఇంకో నలుగురు ఫ్రెండ్స్‌కీ ఫోన్ చేసి సమీర తన ఆలోచన చెప్పింది.

"సినిమాలు, షికార్ల కోసం మానెయ్యగాలేంది, నువ్వొక మంచి ప్రయత్నం చేస్తోంటే, సపోర్టుగా ఒక రోజు కాలేజి మానెయ్యటానికేం...!" అన్నారు వాళ్ళు.

సమీర చకచకా తన పనులు ముగించేసింది. నలుచదరంగా ఉన్న ఒక అట్టకి ఒక చిన్న స్టాండు అమర్చి, అట్ట మీద గుండ్రని అక్షరాలతో ఇలా రాసింది.

'ఉద్యోగ ధర్మంగా నిర్వర్తించాల్సిన పనికీ అదనంగా పైకం చెల్లించాల్సిందేనంటున్న అధికారికి నిరసనను తెలియచేస్తూ, సాగిస్తున్న పోరాటమిది. మీ అందరి సహాయ సహకారాల్ని అర్థిస్తున్నాను.'

కలెక్టరాఫీసు ఆఫీసు ఆవరణలో అందరికీ కనపడేట్లుగా ఒక పక్కగా ఆ అట్టస్టాండును ముందు పెట్టుకుని సమీర కూర్చుంది. అక్కడికి దగ్గర్లోనే ఒక చెట్టు క్రింద ఆమె స్నేహితులు కూర్చున్నారు.

కొందరు ఆఫీసులోకి వెళ్లేవాళ్లు ఒక క్షణం ఆగి ఆ వాక్యాన్ని చదివి, నిర్లిప్తంగా చూసి వెళ్ళిపోతే, మరికొందరు దగ్గరకు వచ్చి ఎవరు, ఏమిటి, ఇదంతా ఎందుకు అని ఆరాలు తీశారు. సమీర చిరునవ్వుతో ఆ వాక్యాల్ని చూపించి మౌనం వహించింది. ఇంకొందరు జేబు నుండి కొంత మొత్తం ఇవ్వబోతుంటే, వద్దంటూ వినయంగా తిరస్కరించింది సమీర.

ఒకరు "చిన్న పిల్లవు. ఇలా చేస్తున్నావేంటమ్మా...?" అని ప్రశ్నిస్తే "చిన్నపిల్లను కనుకే ఇంకోదారి కనిపించక ఈవిధంగా న్యాయపోరాటం చేస్తున్నాను సార్..." అని బదులిచ్చింది.

ఇంకొకరు "చిన్నపిల్లవు. నీ మీద దాడి చేస్తారేమోననే భయం లేకుండా ఏమిటిది..?" అని హెచ్చరించారు. "నిజమే సార్.. జంతువుల భయం లేకుండా అడవిలోనైనా తిరగొచ్చుగానీ ఇప్పట్లో మనుష్యులకే భయపడాల్సి వస్తోంది! అయినా.. ఎవరైనా దౌర్జన్యం చేస్తే.. మీలాంటి వాళ్ళు అడ్డం వస్తారనే నమ్మకం నాకుందండీ...!" అని జవాబిచ్చింది సమీర.

ఆ రోజు ఆఫీసులో అదొక సంచలన వార్త అయింది! కలెక్టరు గారికీ తెలిసింది. సమీరను లోపలకు పిలిపించారు. విషయమేమిటని ఆరా తీశారు.

ఆయన ముందు విన్నవించుకునే అవకాశం అంత తొందరగా వస్తుందని ఊహించని సమీర ఆనందంతో తన తండ్రికి జరిగిన అన్యాయమంతా వివరించింది. "మీ నిజాయితీ గురించి విన్నాను సార్. అందుకే మీకు చెప్పుకో గలిగే అవకాశం వస్తే, నాకు న్యాయం కలుగుతుందనే నమ్మకంతోనే ఇలా చేశాను..." అంటూ ముగించింది.

"నువ్వు చెప్పేదే నిజమని ఎలా అనుకోవటం....? నీకు తెలిసింది మీ నాన్నగారి ద్వారానే కదా...!"

"మీకా సందేహం కలగొచ్చుగానీ... నాకు మా నాన్నగారి మాటల మీద పూర్తి నమ్మకం ఉంది. ఏ చెట్టు నీడ క్రింద పెరుగుతున్నామో, ఆ చెట్టు గురించి మనకు తెలియకుండా ఎలా ఉంటుంది సార్...? ఈ సందర్భంగా మీకో చిన్న సంఘటన చెబుతాను. ఒకరోజు ఎవరో పెద్దాయన మా ఇంటికి వచ్చి నాన్నగారితో మాట్లాడుతున్నపుడు వాళ్ళ సంభాషణ కొంత నేనూ విన్నాను.

ఆయన ఏదో విషయంగా "మీకు ముగ్గురమ్మాయిలున్నాయి. ముందు ముందు వాళ్ళ పెళ్ళిళ్ళు, పేరంటాలు అంటూ ఎన్ని అవసరాలు ఉంటాయో మీకూ తెలుసు గదా, ఇలా గిరి గీసుకుని నిజాయితీ అంటూ కూర్చుంటే లాభం లేదు. గీత దాటాల్సిందే..." అంటే మా నాన్న ఏం జవాబిచ్చారో తెలుసా సార్...! మా అమ్మాయిలు ఆర్థికంగా స్వతంత్రంగా నిలబడటానికి వీలయ్యే చదువులు చెప్పించగలిగేంత స్థోమత నాకుంది. వాళ్ళ చదువు, నడవడీ మెచ్చి వచ్చిన వాళ్ళతోనే పెళ్ళిళ్ళు జరిపిస్తాను గానీ, కట్నకానుకలివ్వటానికి నా మనస్తత్వానికి విరుద్ధంగా వేరే దారిలో సంపాదించను" అని చెప్పారు.

ఆ మాటలు విన్నపుడు నేను చాలా ఆనందంగా, గర్వంగా కూడా ఫీలయ్యాను! నిజాయితీకి గుర్తింపు, గౌరవం కలగకపోయినా ఫర్వాలేదు గానీ శిక్షమాత్రం పడకూడదు కదా సార్...! నిజాయితీని నిరూపించుకోవటానికీ అవినీతి మార్గం పట్టాల్సిన దుస్థితికి మా నాన్న తల్లడిల్లిపోతూంటే, భరించలేక మీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావాలని ఇలా ప్రయత్నం చేశాను సార్...!" వినయంగానే ఎటువంటి సంకోచం లేకుండా చకచకా మాట్లాడుతున్న సమీర వేపు ఆయన ఒక క్షణం విస్మయంగా చూసి "సరే... అక్కడ కాసేపు కూర్చోమ్మా..." అని పక్క గదిని చూపించారు.

ఆయన ఎవరెవరినో పిలిచి ఏవో పనులు పురమాయించిన రెండు గంటలసేపు తర్వాత సమీరకు పిలుపు వచ్చింది. "నేనంతా తెలుసుకున్నాను. రెండు మూడు రోజుల్లోనే మీ నాన్నగారిని జాయినవమనే కబురు వస్తుంది. ఈ విషయం ఇంటికి వెళ్ళి మీ నాన్నగారికి చెప్పు" అని ఆయన అనగానే సమీర ఆనందంతో తబ్బిబ్బు అయిపోయింది. కళ్ళల్లోకి నీళ్ళూ వచ్చేసాయి.

"ఇంత త్వరగా మీరు మా సమస్యని పరిష్కరిస్తారని అనుకోలేదు సార్...! మీరు నిజంగా మా కుటుంబానికి ఊపిరి పోసారు!" అంటూ చేతులు జోడించింది.

"నీ మాటలు, ధైర్యం చూస్తుంటే నాకు ఆశ్చర్యంగానూ, ముచ్చటగానూ అనిపించింది! అందుకే నా పనుల్ని వెనక్కి పెట్టి, ముందుగా నీ పని చూశాను..." అంటూ సమీర చదువు గురించీ, భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నదీ వివరాలనడిగారు.

సమీర చిరునవ్వుతో సమాధానం చెప్పింది. “పట్టుదలతో చదివి మీలాంటి ప్రభుత్వాధికారిగా పనిచేయాలనే కోరికయితే ఉంది సార్! ఒకవేళ ఏ పరిస్థితులవలనైనా అలా కాలేక ఏ ఉద్యోగం చేయాల్సి వచ్చినా సరే, ఉద్యోగ ధర్మాన్ని మాత్రం నిజాయితీగా నిర్వర్తిస్తాను సార్. నిజాయితీకి మీరిచ్చిన గౌరవం చూసాక నాలో ఈ అభిప్రాయం మరింత బలపడింది!”

కృతజ్ఞతాపూర్వకంగా సమీర మళ్ళీ చేతులు జోడించింది కలెక్టరు గారికి.

ఆయన అభినందనగా సమీర భుజం తట్టి “నేను నీ ఫోన్ నెంబరు పక్కన నీ పేరును సమీరగా కాకుండా ‘ధీర’గా నోట్ చేసుకుంటున్నాను. నీ పోరాట స్ఫూర్తికి బిరుదుగా ఇలా మార్చానన్నమాట!” చిరునవ్వుతో అన్నారు.

సెలవు తీసుకుని బయటకు వచ్చిన సమీర తన ఫ్రెండ్సందరికీ ఈ విషయం చెప్పింది. ఇంటికి బయలుదేరిన సమీరకు ఆనందంతో అడుగులు నేలమీదకు ఆగకుండా గాలిలో తేలుతున్నట్లుగా అనుభూతి కలిగింది.

* * *

**‘ఉషోదయ వెలుగు – ఆధ్యాత్మిక మాసపత్రిక’ జనవరి – ఫిబ్రవరి 2019**